జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

బుధవారం | 10-12-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 533 పేజీలు: 4 వెల : రూ.7




# మద్యం తాగి వాహనం నడిపితే.. ఖబడ్దార్!

* జిల్లాలో ముమ్మరంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు
* పట్టుబడితే పదివేలు ఫైన్
* పది రోజులుగా విస్తృతంగా ప్రత్యేక డ్రైవ్
* కోర్టు బోనెక్కిస్తున్న పోలీసులు
* వెంటవెంటనే జరిమానా విధిస్తున్న జడ్జిలు
* హడలెత్తిపోతున్న మందుబాబులు

**శ్రీకాకుళం క్రైం, డిసెంబర్ 9 (వార్త):** మందుబాబులకు పోలీసులు షాక్ ఇస్తున్నారు. జిల్లావ్యాప్తంగా పది రోజులుగా విస్తృతంగా పోలీసులు డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ ఏరియాలో డ్రింకింగ్‌పై తనిఖీలు చేపడుతున్నారు. ప్రత్యేక డ్రైవ్‌లా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండడంతో మందుతాగి వాహనం నడిపే వారి కిక్‌కు వదిలిస్తున్నారు. లోకల్ పోలీసులే కాకుండా రిజర్వు పోలీసులను సైతం రంగంలోకి దించి డ్రంకెన్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నారు. మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడితే చాలు కేసు కట్టి కోర్టు బోనెక్కిస్తున్నారు. జడ్జిలు సైతం వెనువెంటనే డ్రంకైన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వారికి పదేసి వేలు, ఐదేసి వేలు చొప్పున జరిమానా విధిస్తున్నారు. ఈ పది రోజుల్లోనే సుమారు వందకుపైనే డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయంటే అర్థం చేసుకోవచ్చు. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు చేపట్టిన ఈ ప్రత్యేకడ్రైవ్ సత్ఫలితమిస్తోంది. ప్రస్తుతం జిల్లాలో ప్రతిరోజూ ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎక్కువగా మద్యం తాగి నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్లే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసు ఉన్నతాధికారులు భావించి ఈ ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్టు తెలుస్తోంది. దీంతో రాత్రి అయితే చాలు పోలీసులు ఎక్కడికక్కడ డ్రంకైన్ డ్రైవ్ చేపడుతుండడంతో మందుబాబులు వాహనాలపై వెళ్లేందుకు హడలిపోతున్నారు. అల్లంతదూరాన ఉన్న పోలీసులను చూస్తే చాలు బండిని పక్కన పెట్టేసిపోతున్నారు. పోలీసులు ఆ ప్రదేశం నుంచి వెళ్లిన తర్వాతే వెళుతున్నారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో కూడా ఎవరైనా మద్యం తాగితే చాలు వారిని సైతం పోలీసులు పట్టుకుని కేసులు కడుతున్నారు. కాగా, మద్యం అమ్మకాలు చేయిస్తుంది ప్రభుత్వమే.. పట్టుకుంటుంది కూడా ప్రభుత్వమేనంటూ మందుబాబులు చిందులేస్తున్నారు.





**ముగ్గురు మందుబాబులకు 10 వేలు చొప్పున జరిమానా**

సోంపేట: బారువ పోలీసు స్టేషన్ పరిధిలోని మద్యం తాగి వాహనం నడిపిన కేసుల్లో ముగ్గురు వాహన చోదకులకు సోంపేట ప్రిన్సిపాల్ జ్యుడీషియల్ ఫస్టు క్లాస్ మెజిస్ట్రేట్ కె.శ్రీనివాసరావు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానాను మంగళవారం విధించారు. మద్యం తాగి వాహనం నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో పాటు, వాహనదారుల ప్రాణాలకే కాకుండా ఇతర ప్రయాణికుల ప్రాణాలకు కూడా ప్రమాదం ఏర్పడే అవకాశమున్నందున, జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని బారువ ఎస్ఐ తెలిపారు. ఈ డ్రైవ్‌లో మద్యం తాగి వాహనం నడిపిన సదరు వాహన చోదకులపై కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచామన్నారు.

# నేడు టెట్

* పకడ్బందీగా ఏర్పాట్లు చేశాం: డీఈవో

**శ్రీకాకుళం, డిసెంబర్ 9 (వార్త):** శ్రీకాకుళం జిల్లాతో పాటు ఒడిశాలోని బరంపురంలో జరగబోవు ఏపీ టెట్ 2025 కంప్యూటర్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేశామని డీఈవో ఎ.రవిబాబు తెలిపారు. బుధవారం జరిగే ఈ పరీక్ష కోసం ఏడు కేంద్రాలు ఏర్పాటు చేశామని, మొత్తం పదివేల 499 మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. ఈనెల 10 నుంచి 21 వరకూ రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయన్నారు. శ్రీకాకుళం జిల్లాలో శ్రీ శివాని కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఎచ్చర్ల, శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఎచ్చెర్ల, కోర్ టెక్నాలజీస్ నరసన్నపేట, ఆదిత్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ టెక్కలి, సెంటర్లలో 9221 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. బరంపురంలో గల పరీక్ష కేంద్రాలలో 1278 మంది అభ్యర్థుల హాజరవుతారని తెలిపారు. ఇందుకు సంబంధించి ఎస్ ఎమ్ ఐ టి ఆన్లైన్ ఎగ్జామినేషన్ సెంటర్ బరంపురం గంజాం, కేదార్నాథ్ టెక్నాలజీస్ బరంపురం గంజాం, గవర్నమెంట్ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ బరంపురం గంజాం, సెంటర్లలో పరీక్ష జరుగుతుందని తెలిపారు. పరీక్షా కేంద్రాలకు మండల విద్యాశాఖ అధికారులను డిపార్ట్మెంటల్ అధికారులుగా నియమించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలకు హాజరగు విద్యార్థులు వారి వారి హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసుకొని కేంద్రాలకు ఒక గంట సమయం ముందుగా హాజరుకావాలని తెలిపారు. పరీక్షా కేంద్రాలకు ఎటువంటి మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు, క్యాలిక్యులేటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబడవన్నారు.

# రిమ్స్ సూపరింటెండెంట్‌గా ప్రసన్న కుమార్



* బాధ్యతలు స్వీకరణ
* అభినందనలు తెలియజేసిన వివిధ విభాగాధిపతులు, వైద్యులు

**శ్రీకాకుళం, డిసెంబర్ 9 (వార్త):** సర్వజనాసుపత్రి (రిమ్స్) సూపరింటెండెంట్‌గా సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్, విభాగాధిపతి డాక్టర్ ఎల్.ప్రసన్న కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఎన్నో ఏళ్లుగా రిమ్స్‌లో వైద్యసేవలు అందిస్తూ రోగులు, వారి బంధువులతో పాటు వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల మన్ననలు పొందారు. సీనియర్ వైద్యునిగా ఆయన జిల్లావాసులకు సుపరిచితమే. వైద్యరంగంలో ఎన్నో ఏళ్లుగా సేవలు అందిస్తున్న డాక్టర్ ప్రసన్న కుమార్ రిమ్స్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టడం పట్ల ఆసుపత్రిలోని వివిధ విభాగాల విభాగాధిపతులు, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.



## తల్లిదండ్రులకు..

ఆ తల్లిదండ్రుల ఖర్మ... విధి రాసిన రాత... ఎవరు తప్పించలేరని అంటారు.. ఈ కోవలోనే ఇద్దరు కొడుకులకు గాను రెండేళ్ల క్రితం చిన్న కొడుకు రైలు ప్రమాదంలో మృతిచెందగా కంటికి రెప్పలా కాపాడుకున్న ఒకే ఒక్క మిగిలిన కొడుకు మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడటంతో ఆ తల్లిదండ్రులు పడిన వేదన... అనుభవించిన క్షోభ అంతా ఇంతా కాదు. రెండేళ్ల కాలంలో పెరిగి పెద్దయిన ఇద్దరు కొడుకులు వేరువేరు ప్రమాదాల్లో మృతి చెంది తల్లిదండ్రులకు కడుపుకోతను మిగిల్చింది.

# కడుపుకోత



* రెండేళ్ల కిందట చిన్నకొడుకు.. ఇప్పుడు పెద్ద కొడుకును మింగేసిన మృత్యువు
* వేర్వేరు ప్రమాదాల్లో మరణించిన కొడుకులు
* కన్నీరుమున్నీరవుతున్న తల్లిదండ్రులు
* గోకర్ణపురంలో విషాదం



**సోంపేట, డిసెంబరు 9 (వార్త):** కంచిలి మండలం గోకర్ణపురం గ్రామానికి చెందిన 28 ఏళ్ల వయసు గల సీర సాయి అనే యువకుడు జనంత్రకోట సమీపంలో జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంలో వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. సమాచారం అందడంతో ఏడు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే జాతీయ రహదారి సిబ్బంది, కంచిలి పోలీసులు మృతదేహాన్ని సోంపేట కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించడంతో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. ఆసుపత్రి ప్రాంగణం అంతా రోదనలతో మిన్నంటింది. తల్లిదండ్రుల రోదనలు ఆపడం ఎవరి తరం కాలేదు. వ్యవసాయ కూలీలైన తల్లిదండ్రులు శ్యాము, చిన్నమ్మలకు మిగిలిన ఒక్క కొడుకు సాయి వృద్ధాప్యంలో ఆదుకుంటాడని కుటుంబాన్ని నడిపిస్తాడని ఎంతగానో ఆశించిన వారి ఆశలు అడియాసలైయ్యాయి. చిన్న కొడుకు రెండేళ్ల క్రితం కంచిలి వద్ద రైలు ప్రమాదంలో మృతి చెందడంతో ఇప్పటికీ తేరుకోలేని ఆ కుటుంబానికి భరించలేని మరో షాక్ ఎదురైంది. పెరిగిన ఇద్దరు కొడుకులు కళ్ళారా మృత్యువాత పడటంతో ఆ కుటుంబీకులు ఎంతగానో తల్లడిల్లుతున్నారు. సోంపేట ఆసుపత్రి వద్ద మంగళవారం సాయంత్రం కంచిలి ఎస్సై పారినాయుడు ఆసుపత్రి వైద్యులు పంచనామా అనంతరం పోస్టుమార్టం నిర్వహించారు. మృతి చెందిన సాయి గోకర్ణపురం పంచాయతీ సర్పంచ్ యారాడి ఆనందరావుకు స్వయానా మేనల్లుడు కావడంతో ఆసుపత్రి వద్దకు కంచిలి ఎంపీపీ పైల దేవదాసు రెడ్డి, ఎమ్మెస్ పల్లి సర్పంచ్ కొనపల సురేష్, వైసీపీ నేతలు మద్దు వెంకటరావు, మద్దు అభి, జాడపూడి సర్పంచ్ జయరాం తదితరులు హాజరయ్యారు. కంచిలి ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## అఖిల భారత సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయండి

**కొత్తూరు, డిసెంబరు 9 (వార్త):** విశాఖలో ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకు జరగనున్న సీఐటీయూ అఖిల భారత మహాసభలను రైస్ అండ్ ఆయిల్ మిల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమంతు ఈశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం కొత్తూరులో రైస్ అండ్ ఆయిల్ మిల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో విస్తృత ప్రచార సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతు ఈశ్వరరావు మాట్లాడుతూ, కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు సాగిస్తున్న సీఐటీయూ మహాసభలు చారిత్రక ప్రాధాన్యతను కలిగి ఉన్నాయని, వీటిని కార్మికులంతా విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ కన్వీనర్ పనస రమేష్ మాట్లాడుతూ, కార్మికులు ఐక్యంగా ఉండి మహాసభల సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచారంలో సీఐటీయూ కన్వీనర్ పనస రమేష్, యూనియన్ నాయకులు, కార్యకర్తలు, రైస్ మిల్ వర్కర్స్ పాల్గొన్నారు.




## పంటకోత ప్రయోగాల నిర్వహణ



**నరసన్నపేట, డిసెంబరు 9 (వార్త):** ప్రభుత్వ ఆదేశాల మేరకు నరసన్నపేట మండలంలో పంటకోత ప్రయోగాలను వ్యవసాయ శాఖ చేపడుతున్నట్లు ఏఎస్ఓ జోగారావు తెలిపారు. మంగళవారం బాడం పంచాయతీ పరిధిలో వ్యవసాయ శాఖ అధికారి సూర్యకుమారి ఆధ్వర్యంలో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా 162 ప్రయోగాలు చేపట్టాల్సి ఉండగా, ఇప్పటివరకు 68 పంటకోత ప్రయోగాలు పూర్తయ్యాయని తెలిపారు. పంటకోత ప్రయోగాల ద్వారా ఎకరాకు సుమారు 30 బస్తాల వరకూ దిగుబడి నమోదవుతోందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బందితో పాటు స్థానిక రైతులు పాల్గొని ప్రయోగాలను పరిశీలించారు. ఇదే సందర్భంగా ఖరీఫ్ అనంతరం వచ్చే రబీ సీజన్‌లో ఎరువుల వినియోగంపై రైతులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీ ఎల్. వెంకట మధు సూచించారు. నరసన్నపేట మండలం బాడం రైతు సేవా కేంద్ర పరిధిలో వ్యవసాయ శాఖ అధికారి సూర్యకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుల అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏడీ వెంకట మధు మాట్లాడుతూ, ముఖ్యంగా మొక్కజొన్న పంట సాగు చేసే విధానాలు, ఎరువుల సమతుల్య వినియోగం, అలాగే చీడపీడల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. సమగ్ర వ్యవసాయ పద్ధతులు అమలు చేస్తే మంచి దిగుబడులతో పాటు ఖర్చులు కూడా తగ్గుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక రైతులు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## ఎస్సీఈఆర్టీ ప్రశ్నాపత్రాల పంపిణీ



**జలుమూరు, డిసెంబరు 9 (వార్త):** జలుమూరు మండలం లింగాలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా పలు విద్యాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు ఉపాధ్యాయుడు బమ్మిడి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం 10వ తరగతి విద్యార్థులకు ఎస్సీఈఆర్టీకు సంబంధించిన ప్రశ్నా పత్రాల నమూనాలను అందజేశారు. విద్యార్థులకు ఉపయోగపడే విధంగా రూపొందించిన ఈ ప్రశ్నా పత్రాలను పాఠశాల హెడ్‌మాస్టర్ జి.వి.రమణ చేతులు మీదుగా పంపిణీ చేసినట్లు ఆయన చెప్పారు. ఇవి పరీక్షల సిద్ధతలో విద్యార్థులకు మార్గదర్శకంగా నిలుస్తాయని, ప్రశ్నల నమూనాపై స్పష్టతను కల్పిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని ఉపాధ్యాయులు అభిప్రాయ పడ్డారు. పాఠశాలలో చేపడుతున్న ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో దోహదపడుతున్నాయని వారు వెల్లడించారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



**నరసన్నపేట, డిసెంబరు 9 (వార్త):** యువత మాదక ద్రవ్యాల జోలికి పోకుండా అప్రమత్తంగా ఉండాలని ఈగల్ క్లబ్ నరసన్నపేట మండల కోఆర్డినేటర్ సురవరపు సత్యనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ, తెలిసి తెలియని వయస్సులో యువత మాదక ద్రవ్య వినియోగానికి ఆకర్షితులు అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాల వల్ల విద్యా భవిష్యత్‌తో పాటు ఆరోగ్యం, కుటుంబ జీవితం దెబ్బతింటాయని పేర్కొన్నారు. విద్యార్థులు లక్ష్య సాధనపై దృష్టి సారిస్తూ మంచి మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.పవన్ మాట్లాడుతూ, ఇటువంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల్లో చైతన్యం పెంచుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని అవగాహన పొందారు.

## భజన కళాకారుడు ప్రకాష్ కు ఘన సన్మానం

**సోంపేట, డిసెంబరు 9(వార్త):** కవిటి మండలం గొండ్యాల పుట్టుగ గ్రామానికి చెందిన భజన కళాకారుడు గేదెల ప్రకాష్ కువిటిలో వెలసిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ మంగళవారం రాత్రి దుస్సాలువు కప్పి ఘనంగా సన్మానించింది. భజనలలో డోలక్ వాయిస్తూ దశాబ్దాలుగా సంగీతంపై మక్కువతో అనేక దేవాలయాలు ఇతరత్రా కార్యక్రమాల వద్ద భజన కాలక్షేపాలలో ప్రకాష్ డోలాక్ వాయిద్య%శీ%తో అందరినీ విశేషంగా ఆకట్టుకుంటున్నారు. మంగళవారం ఆలయ సంవత్సర వేడుకలు సందర్భంగా ప్రకాష్ ను సత్కరించారు.



## ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా
# వైఎస్సార్‌సీపీ ఉద్యమం ఉధృతి

**నరసన్నపేట, డిసెంబరు 9 (వార్త):** ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేసే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ ఉద్యమం తుది దశకు చేరుకుంది. ప్రజల ప్రయోజనాలను కాపాడే ఈ ఉద్యమానికి రాష్ట్రవ్యాప్తంగా విశేష స్పందన లభిస్తోంది. ఈ క్రమంలో శ్రీకాకుళం జిల్లాలోని నరసన్నపేట నియోజకవర్గం నుంచి ఏకంగా 59,000 సంతకాలు సేకరించడం విశేషంగా నిలిచింది. జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, జిల్లా పరిశీలకుడు కుంబా రవిబాబు నేతృత్వంలో మంగళవారం నరసన్నపేట, ఆమదాలవలస, శ్రీకాకుళం నియోజకవర్గాల్లో భారీగా సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. సేకరించిన సంతకాల పత్రాలను భద్రపరిచిన సందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తలు వాటిని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని తమ నిరసనను ఘనంగా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ, ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రజా ఆరోగ్య వ్యవస్థను బలపరిచే బదులు ప్రైవేటీకరణకు పాల్పడటం ప్రజావిరుద్ధ నిర్ణయమని విమర్శించారు. అలాగే రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని,



'సూపర్ సిక్స్' హామీల అమలు, ఉద్యోగుల బకాయిల విడుదల వంటి అంశాలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సేకరించిన సంతకాల పత్రాలను జిల్లా కేంద్రాల నుంచి పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపించే కార్యక్రమాన్ని ఈ నెల 15వ తేదీన భారీ ర్యాలీతో చేపట్టాలని పార్టీ నిర్ణయించింది. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం నుంచి జరగనున్న ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కార్యకర్తలకు కృష్ణదాస్ పిలుపునిచ్చారు. అనంతరం, పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో ఈ కోటి సంతకాల పత్రాలను ఈ నెల 17వ తేదీ సాయంత్రం 4 గంటలకు గవర్నర్ గారికి అందజేయనున్నట్లు తెలిపారు. ఇదే సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకురాలు శ్రీమతి వైఎస్ భారతి రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని పార్టీ కార్యాలయంలో మహిళా నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా హితాన్ని కాపాడే ఈ ఉద్యమం మరింత బలంగా ముందుకు సాగుతుందనే సంకేతాన్ని ఈ కార్యక్రమం ఇచ్చింది.

## కొత్తూరు ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు



**కొత్తూరు, డిసెంబరు 9 (వార్త):** రైతులకు నాణ్యమైన ఎరువుల సరఫరా మరియు అమ్మకాలలో పారదర్శకతను నిర్ధారిస్తూ, రణస్థలం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ వి.శ్రీనివాస్ మంగళవారం కొత్తూరు మండలంలోని ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్స్, లైసెన్స్‌లు, రసీదులు వంటి అన్ని రికార్డులను పరిశీలించారు. దుకాణాలలో ఎరువులను సక్రమంగా నిల్వ చేయడమే కాకుండా, ప్రభుత్వం నిర్దేశించిన విక్రయ విధానాలు అమలు అవుతున్నాయా లేదా అనే అంశంపై ఆయన ప్రత్యేకంగా దృష్టి సారించారు. ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా అమలు అయ్యేలా వ్యవహరించాలని డీలర్లకు సూచించారు.పారదర్శక సరఫరా పర్యవేక్షణమండలంలో ఎరువుల సరఫరా పూర్తి పారదర్శకంగా ఉండేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ఈ ఆకస్మిక తనిఖీల ద్వారా ఎరువుల డీలర్లలో మరింత బాధ్యతాయుత వైఖరిని పెంపొందించి, రైతులకు మేలు చేసే దిశగా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ తనిఖీ కార్యక్రమంలో కొత్తూరు వ్యవసాయ అధికారిణి స్వర్ణలత , సిబ్బంది పాల్గొన్నారు.

## దాతల సహకారంపై హర్షం

**- నరసన్నపేటకు ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహాయం**

**-విరాళాల వెల్లువ కళాశాల -మెగా పేరెంట్స్ మీటింగ్ 3.0 విజయంపై సిబ్బంది ఆనందం**




**నరసన్నపేట, డిసెంబరు 9(వార్త):** నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల నరసన్నపేటలో జరిగిన మెగా పేరెంట్స్ మీటింగ్ (పీటీఎం 3.0) సందర్భంగా దాతలు ప్రకటించిన సహకారంపై సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. పేరెంట్స్ మీటింగ్ కి హాజరైన కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ బలగ మురళి 50వేలు, అరుణకుమారి (జూనియర్ అసిస్టెంట్) 50వేలు, వాన గోవిందరావు (జమ్ము) 20వేలు, చిట్టి సాయికిరణ్ (డైరక్టర్, సాయిరత్న ఐటీఐ) 20 వేలు, నందాన బాబ్జీ 10వేలు, రుప్ప సోమశేఖర్ (జేఎల్) 5 వేలు, ప్రిన్సిపాల్ మరపట్ల పవన్ 20 వేలు చొప్పున కళాశాల అభివృద్ధికి విరాళాలు ఇచ్చినట్లు సిబ్బంది తెలిపారు. దాతల సహకారంతో కళాశాల అభివృద్ధికి మరింత కృషి చేస్తానని ప్రిన్సిపాల్ మరపట్ల పవన్ తెలిపారు. మంచినీటి సౌకర్యం, మిడ్ డే మీల్ వంటశాల నిర్మాణం, ఇతర మరమ్మత్తుల కోసం నిధులను వినియోగిస్తానన్నారు. పూర్వ విద్యార్థులందరూ ఈ విషయాన్ని గుర్తించి తమ కళాశాలకు నిధులు సమకూర్చేందుకు ముందుకు రావాలని ఆయన కోరారు.

## కౌమార దివ్యాంగుల సహిత విద్యపై అభిప్రాయ సేకరణ

**టెక్కలి, డిసెంబరు 9(వార్త):** ఎన్.సి.ఇ.ఆర్.టి. ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కౌమారదశలో ఉన్న దివ్యాంగ విద్యార్థులకు అమలవుతున్న సహిత విద్య ఇన్ క్లూజీవ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలపై, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు శ్రీకాకుళం జిల్లా రీసెర్చ్ సూపర్వైజర్, సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రత్యేక ఉపాధ్యాయుడు సనపల రాంబాబు తెలిపారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని రూరల్, అర్బన్ ప్రాంతాలలో ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో సహిత విద్య, అమలు తీరును పరిశీలించి, దివ్యాంగ విద్యార్థులకు అందుతున్న విద్యా సదుపాయాలు, ప్రత్యేకబోధనా పద్దతులు, సహాయక ఉపకరణాలు వినియోగం, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కారానికి సూచనలపై సమగ్రగా అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ అభిప్రాయాల సేకరణ ద్వారా సహిత విద్య అమలులోని లోటుపాట్లను గుర్తించి, రాష్ట్ర స్థాయిలో మరింత సమర్థవంతమైన విద్యా విధానాల రూపకల్పకు ఉపయోగించనున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు తమ అనుభవాలు, సూచనలు స్పష్టంగా నమోదు చేయడం ద్వారా ఈ పరిశోధనకు సహకరించాలని ఆయన కోరారు. కౌమార దివ్యాంగ విద్యార్థులకు సమాన విద్యావకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టినట్లు అన్నారు ఈ కార్యక్రమంలో బూరగాం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు వివిధ మండల పరిధిలోని అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొంటున్నారన్నారు.



## విద్యుత్ వెలుగులకు అధిక ప్రాధాన్యం



**సోంపేట, డిసెంబరు 9(వార్త):** కంచిలి మండలం ఎస్ఆర్సి పురం పంచాయతీలో వీధుల్లో విద్యుత్ వెలుగులకు పంచాయతీ సర్పంచ్ డొక్కరి తులసి బలరాం అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. గ్రామీణ ప్రాంతం కావడంతో చీకటి వేళల్లో ప్రమాదాలు పొంచి ఉండే కారణంగా ఎటువంటి చీకటి పరిస్థితి లేకుండా ప్రతిచోట విద్యుత్ బల్బులు పంచాయతీ తరపున ఏర్పాటు చేస్తున్నారు. ఒకవేళ బల్బులు పాడయి సాంకేతిక సమస్యతో విద్యుత్ లేని పరిస్థితుల్లో వెంటనే స్పందిస్తూ విజయానికి వెనుకాడకుండా బల్బులు అమర్చి వెలుగులు పంచుతున్నారు. దీని పట్ల పంచాయతీ ప్రజలు సర్పంచ్ తీరును అభినందిస్తున్నారు.

## నీమాస్త్రం వాడకంపై సూచన



**కొత్తూరు, డిసెంబరు 9(వార్త):** జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ పూజారి సత్యన్నారాయణ ఆదేశాల మేరకు, కొత్తూరు మండలం మహాసింగీగూడ గ్రామంలోని రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, కషాయాల తయారీ, వినియోగంపై పూర్తిస్థాయి అవగాహన గూర్చి యూనిట్ ఇంచార్జి చిన్నమ్మి ఆధ్వర్యంలో రైతులు 200 లీటర్ల ద్రవ జీవామృతం మరియు 100 లీటర్ల నీమాస్త్రం తయారీని స్వయంగా చేయడం జరిగింది. ఈ సందర్భంగా యూనిట్ ఇంచార్జి చిన్నమ్మి, ఐసీఆర్‌పీ మొఖలింగం, ఐసీఆర్‌పీ ట్రైనీ రూప, సంతోష్ రైతుల వద్దకు వెళ్లి ద్రవ జీవామృతం, నీమాస్త్రం తయారుచేసే విధానాన్ని, వాటిని పంటలకు వాడటం వలన కలిగే ఉపయోగాలు, అలాగే తయారు చేసిన కషాయాలను ఎంతకాలం నిల్వ చేసుకోవాలనే అంశాలపై సవివరంగా తెలియజేశారు. ప్రస్తుతం జీడి మామిడి పంటలు చిగురు దశలో ఉన్నందున, రసం పీల్చే పురుగుల బెడద ఎక్కువగా ఉంటుందని అధికారులు తెలిపారు. దీని నివారణకు రసాయన పురుగు మందులకు బదులుగా, రైతులు తక్కువ ఖర్చుతో తయారయ్యే నీమాస్త్రాన్ని తప్పనిసరిగా పిచికారీ చేసుకోవాలని సూచించారు. నీమాస్త్రం వాడకం ద్వారా పంట ఆరోగ్యంగా ఉండటంతో పాటు, రైతులకు పెట్టుబడి ఖర్చు కూడా తగ్గుతుందని వారు వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జి చిన్నమ్మి, మొఖలింగం, ట్రైనీలు రూప, సంతోష్ తో పాటు మహాసింగీగూడ గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డ్రంకెన్‌డ్రైవ్ కేసులో రూ.2,500 జరిమానా



**నరసన్నపేట, డిసెంబరు 9 (వార్త):** డ్రంకెన్‌డ్రైవ్ కేసులో కోటబొమ్మాలికి చెందిన మురమళ్ల చిట్టి ప్రసాద్‌కు నరసన్నపేట ఫస్ట్ క్లాస్ జడ్జి సోమవారం రూ.2,500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. మద్యం మత్తులో వాహనం నడిపినందుకు ఈ శిక్ష విధించబడినట్లు సీఐ తెలిపారు. అదేవిధంగా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన కేసుల్లో పిడూరి శ్రీనివాసరావు, చీపురు ప్రతాప్, ధర్మాన సింహాచలం, కేవిటి సోమేశ్వరరావు, గురువెల్లి డిలేశ్వరరావు, మంగ కృష్ణ, దుర్వి దాసయ్యలకు ఒక్కొక్కరికి రూ.600 చొప్పున జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెల్లడించినట్లు సీఐ వెల్లడించారు. ప్రజా భద్రత దృష్ట్యా డ్రంక్ అండ్ డ్రైవ్, బహిరంగ మద్యం సేవనంపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై నిర్దాక్షిణ్యంగా కేసులు నమోదు చేసి న్యాయస్థానం పరిధిలోకి తీసుకువస్తామని సీఐ తెలిపారు.

## ఏడుగురిపై బైండోవర్ కేసుల నమోదు

**ఇచ్ఛాపురం, డిసెంబరు 9(వార్త):** స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఏడుగురి పై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు సి ఐ పి దుర్గా ప్రసాద్ చెప్పారు. మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ తహశీల్దార్ ఎన్ వెంకట్రావు సమక్షంలో నమోదు చేసినట్లు తెలిపారు. సారా కేసులు నిందితులు నిబంధనలు ఉల్లంఘించి తే లక్షరూపాయల జరిమానా విధిస్తారని చెప్పారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## సాంకేతిక అప్లికేషన్స్‌పై ఐతంలో మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు



**టెక్కలి, డిసెంబరు 9 (వార్త):** టెక్కలి సమీపంలోని ఐతం కళాశాలలో ఐసిఈఎమ్‌టిఎ 2025" పేరుతో అంతర్జాతీయ రెండవ సదస్సు డిసెంబర్ 10, 11, 12 తేదీలలో హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహించబడనున్నట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు మంగళవారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సును ఎలక్ట్రానిక్స్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్, ఇంటెలిజెంట్ సిస్టమ్స్, టెక్ ఇన్నోవేషన్స్ వంటి మౌలిక రంగాల్లో జరుగుతున్న తాజా పరిశోధనలపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిపుణుల సమక్షంలో నిర్వహించబడనున్నట్లు వివరించారు. దేశం నలుమూలల నుండి, విదేశాల నుండి అనేక మంది పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు పాల్గొనబోతున్నారని తెలిపారు. కళాశాల పరిశోధన స్థాయి మరింతగా అభివృద్ధి చెందేందుకు, విద్యార్థుల్లో సృజనాత్మకతను, పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించేందుకు ఐ సి ఈ ఎమ్ టి ఎ 2025 ఒక వేదికగా నిలుస్తుందని ప్రొఫెసర్ నాగేశ్వరావు పేర్కొన్నారు. సదస్సుకు సంబంధించిన పూర్తి వివరాలు కళాశాల అధికారిక వెబ్‌సైట్ www.icemta.orgలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. సదస్సు విజయవంతం కోసం సంబంధిత విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు కలిసి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

# సీజ్ చేసిన ప్లాస్టిక్ ఏమి చేశారో?

### -పొంతన లేని లెక్కలు
### చెబుతున్న మున్సిపల్ అధికారులు
### -యధావిధిగా ప్లాస్టిక్ విక్రయాలు

**పలాస, డిసెంబరు 9(వార్త):** ప్లాస్టిక్ విక్రయాలపై ఉక్కుపాదం మోపుతామని అధికారులు మారినప్పుడల్లా చెప్పిన మాట వాస్తవ రూపం దాల్చడం లేదని కాశీబుగ్గ ప్రజలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలాస కాసేపు మున్సిపాలిటీలో ఉన్న కాశీబుగ్గ చెందిన నిత్యానంద నగర్, ఎస్కే ప్లాస్టిక్ గోడౌన్ లో మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో నిన్న రాత్రి జరిగిన మెరుపు రైడ్స్ పై పలు అనుమానాలు కలుగుతున్నాయని ప్రజలు గుసగుసలాడు కుంటున్నారు. రైడ్స్ సమయంలో ఎటువంటి నిబంధనలను అమలు చేయలేదని,ఎన్ని టన్నుల ప్లాస్టిక్ ని సీజ్ చేశారో ఇప్పటికీ కూడా తెలియజేయకపోవడం చూస్తుంటే పెద్ద ఎత్తున రాత్రి సమయంలోలోపాయికరి ఒప్పందాలు జరిగినట్లా పలువురు అనుమానిస్తున్నారు. ఆ గోడౌన్ లో ఉన్న ఇతరత్రా సామాన్లను కూడా మున్సిపల్ కమిషనర్ తీసుకువెళ్లిపోయినట్లు, గోడౌన్ యజమాని గగ్గోలు పెడుతున్నారు. అర్ధరాత్రి వరకూ కూడా ఎన్ని టన్నుల ప్లాస్టిక్ని సీజ్ చూపించాలనే విషయమై పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్టు తెలుస్తోంది. ప్లాస్టిక్ తో స్వాధీనం చేసుకున్న వ్యాన్ విషయమై ఏం చేశారు..? కూడా తెలియపరచడం లేదు. జంట పట్టణాలలో ఉండే మిగతా ప్లాస్టిక్ గోడౌన్లను సీజ్ చేయకుండా ఉండేందుకు కమిషనర్ ఆయా గోడౌన్ల యజమానులతో కూడా రేట్లను ఫిక్స్ చేసుకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే వాటి జోలికి కమిషనర్ పోవట్లేదని తెలుస్తోంది. ఈ మొత్తం వ్యవహారంపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించి, విచారణ చేపించాలని గోడౌన్ యాజమాని విజ్ఞప్తి చేస్తున్నారు.



ఒరిస్సా రాష్ట్ర సమీప సరిహద్దులో గల పలాసలో పెద్ద ఎత్తున లభ్యమవుతున్న ఈ ప్లాస్టిక్ విషయమై నేరుగా జిల్లా యంత్రాంగమే దృష్టి సారంచాలని పట్టణవాసులు కోరుతున్నారు. అధికారులు మారినప్పుడల్లా ప్లాస్టిక్ పై మెరుపుదాడులు చేసి హడావుడి చేస్తున్న తప్పితే శాశ్వతంగా ప్లాస్టిక్ విక్రయాలు ఆపడం లేదని ఆరోపణలు వేలువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు దీనిపై దృష్టి చారించి పకడ్బందీగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## లక్ష్యాల సాధనలో శాఖలు వేగం పెంచాలి

### -కీలక పనితీరు సూచికలపై కలెక్టర్ సమీక్ష



**శ్రీకాకుళం, డిసెంబరు 9 (వార్త):** ప్రభుత్వ శాఖల పనితీరులో వేగం పెంచి, కీలక పనితీరు సూచికలు (కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్) ఆధారంగా లక్ష్యాలను సమయపాలనతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన వారపు వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన శాఖల వారీగా సుదీర్ఘ సమీక్ష చేపట్టారు. కేపీఐ ఆధారంగానే శాఖల పనితీరు మూల్యాంకనం జరుగుతుందని, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారికి తావులేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమీక్షలో వ్యవసాయ శాఖ, మైనారిటీ వెల్ఫేర్, అటవీ శాఖ, గృహ నిర్మాణ శాఖ, ఐసిడిఎస్, ఎస్సీ కార్పొరేషన్ల ప్రగతిపై కలెక్టర్ వివరంగా చర్చించారు. రైతులకు అందే సేవలు, సంక్షేమ పథకాల పారదర్శక అమలు, వైద్యం, ఆరోగ్యం అంశాలలో పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రజా సానుకూల దృక్పథంలో ఆర్టీసీ, పెన్షన్ల.పంపిణీ, ఇంటింటికి చెత్త సేకరణ అంశాలలో ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా సేకరించిన ప్రజాభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆర్టీసీ సిబ్బంది ప్రవర్తన, ప్రయాణీకుల రక్షణ అంశాలలో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలవడంపై అధికారులను కలెక్టర్ అభినందించారు. అయితే బస్టాండ్లలో మంచినీరు సరఫరా, పారిశుద్ధ్యం వంటి కీలక అంశాలు బాగా మెరుగుపడాలని స్పష్టం చేశారు. శ్రీకాకుళం కాంప్లెక్స్ వద్ద పలు దుకాణాల పక్కనే పెద్ద ఎత్తున చెత్త పేరుకుని ఉండటాన్ని తాను స్వయంగా చూశానని పేర్కొంటూ, పారిశుద్ధ్య పరిస్థితి వెంటనే మారకపోతే దుకాణాలను సీజ్ చేయాలని కఠినంగా ఆదేశించారు. జిల్లా, మండల స్థాయిల్లో అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని ఆయన ఈ సందర్భంగా ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కూన దాతృత్వం

### -పొందూరు కేజీబీవీ విద్యార్థినికి ఆర్థిక సాయం



**పొందూరు, డిసెంబరు 9 (వార్త):** పొందూరు కేజీబీవీ పాఠశాలలో చదువుతున్న లోలుగు గ్రామానికి చెందిన చిత్తరపు వందన అనే విద్యార్థిని పాఠశాలలో ప్రమాదవశాత్తు మెడపై నుంచి జారి పడడంతో తీవ్రంగా గాయపడి కాళ్లు విరిగిన ఘటనపై పాఠశాల అధ్యాపక బృందం, స్థానిక ప్రజా ప్రతినిధుల నుంచి సమాచారం తెలుసుకున్న ఆమదాలవలస గౌరవ శాసనసభ్యులు, రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవికుమార్ ప్రత్యేక చొరవతో ప్రభుత్వం తరపున అత్యవసర వైద్య సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకున్నారు. అవసరమైన సర్జరీలు నిర్వర్తించి, చికిత్స అనంతరం విద్యార్థినిని ఇంటికి విజయవంతంగా తరలించారు. విద్యార్థిని ఇంటికి చేరిన తరువాత, ఎమ్మెల్యే కూన రవికుమార్ వ్యక్తిగతంగా ముందుకొచ్చి తన సొంత డబ్బులు 50,000 రూపాయలను విద్యార్థిని వందనకి అందజేశారు. పొందూరు కేజీబీవీ ప్రిన్సిపాల్, సిబ్బంది సమక్షంలో ఈ ఆర్థిక సహాయం అందించబడింది. విద్యార్థిని త్వరగా కోలుకోవాలని ఆశాభావం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే గారు, భవిష్యత్తులో కూడా విద్యార్థుల భద్రత కోసం పాఠశాలలు సిబ్బందితో మాట్లాడి తగిన జాగ్రత్తలు తీసుకుంటామని తెలియజేశారు. ఎమ్మెల్యే చేసిన ఈ సహాయం పట్ల విద్యార్థిని తల్లి, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## నాగబాబు ఆధ్వర్యంలో 13న కీలక సమావేశం



**నరసన్నపేట, డిసెంబరు 9(వార్త):** ఎమ్మెల్సీకొణిదెల నాగబాబు ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్న కీలక సమావేశానికి సంబంధించి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశం ఎచ్చర్ల నియోజకవర్గంలోని లావేరు మండలంలో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో, లావేరు ఎంఆర్ఓ కార్యాలయం సమీపంలో మధ్యాహ్నం 2.30 గంటలకు జరగనుందని తెలిపారు. పార్టీ భవిష్యత్ కార్యాచరణపై ఈ సమావేశంలో ముఖ్యమైన అంశాలు చర్చించనున్నట్లు పేర్కొన్నారు. జనసేన పార్టీ నరసన్నపేట నియోజకవర్గానికి చెందిన క్రియ వాలంటీర్లు, మండల అధ్యక్షులు అందరూ తప్పనిసరిగా హాజరుకావాలని జనసేన పార్టీ ఇంచార్జ్ బలగ ప్రవీణ్ కుమార్ కోరారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ జనసేన పార్టీ శక్తిని మరింత బలోపేతం చేసే దిశగా ఈ సమావేశం కీలకంగా నిలవనుందని బలగ ప్రవీణ్ కుమార్ అన్నారు. పార్టీకి చెందిన క్రియ వాలంటీర్లు, మండల అధ్యక్షులు సమగ్రంగా పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జనసేన పార్టీ ప్రజల శక్తికి ప్రతీకమని, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడే పార్టీగా ముందుకు సాగుతుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

## కేటీ రోడ్డు ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై సీఐ రామకృష్ణ ప్రత్యేక శ్రద్ధ



**పలాస, డిసెంబరు 9(వార్త):** పలాస కాశీబుగ్గ కేటీ రోడ్డుపై చిరు వ్యాపారులు రోడ్డును ఆక్రమించి వివిధ రకాల ప్రమాదాలకు కారణము అవుతున్నందున వాటిని నివారించేందుకు కాశీబుగ్గ సీఐ వై. రామకృష్ణ మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆయన తన సిబ్బందితో రోడ్డు వెంబడి నడుచుకుంటూ వ్యాపారులకు తగు సూచనలు జారీ చేశారు. వారం రోజుల్లో ట్రాఫిక్ సమస్య పరిష్కారం అయ్యేందుకు వ్యాపారులు సహకరిస్తే మంచిదని పేర్కొన్నారు. అదేవిధంగా పరిమితికి మించిన స్పీడు డ్రైవింగ్, పబ్లిక్ ప్రదేశాలలో మద్యం సేవించడం, ఈవ్ టీజింగ్, గంజాయి తదితర నేర పూరిత చర్యలపై కూడా తమ సిబ్బంది మాఫ్టీలో నిఘా పెట్టడం జరుగుతుందని సీఐ తెలిపారు. కాలేజీలను విడిచిపెట్టిన సమయాల్లో కొంతమంది విద్యార్థులు ఆకతాయిలుగా ప్రవర్తిస్తున్నారని, విద్యార్థులు సరిదిద్దుకోకపోతే కేసులు తప్పవని తమ భవిష్యత్తుని పాడు చేసుకోవద్దని సిఐ రామకృష్ణ హెచ్చరించారు.

## విశాఖలో 18న తపాలా అదాలత్

**శ్రీకాకుళం, డిసెంబర్ 9 (వార్త):** విశాఖ రీజియన్ పరిధిలోని తపాలా వినియోగదారుల సమస్యల పరిష్కార నిమిత్తం డిసెంబర్ 18న ఉదయం 11 గంటలకు 120వ తపాలా అదాలత్ నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ కె.వి.డి.సాగర్ తెలిపారు. ఎంవీపీ బస్ కాంప్లెక్స్ పక్కన ఉన్న పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయంలో ఈ అదాలత్ జరుగుతుందన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి తదితర 9 జిల్లాల పరిధిలోని వినియోగదారులు తమ ఫిర్యాదులను డిసెంబర్ 15లోగా.. కె.వి.డి.సాగర్, అసిస్టెంట్ డైరెక్టర్, పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయం, విశాఖపట్నం-530017' చిరునామాకు కూడా పంపవచ్చని, కవరుపై '120వ తపాలా అదాలత్' అని పేర్కొనాలని సూచించారు.

# పలాస జిల్లా సాధిద్దాం



**సోంపేట, డిసెంబరు 9 (వార్త):** పలాస జిల్లాను ఎలాగైనా సాధించి తీరాలని అందుకు ప్రతి ఒక్కరు సహకరించి పోరాటానికి మద్దతు ఇవ్వాలని పోరాట కమిటీ అధ్యక్షుడు దువ్వాడ శ్రీధర్ పిలుపునిచ్చారు. ప్రముఖ వైద్యులు దువ్వాడ జీవితెశ్వర రావు తో కలసి మంగళవారం రాత్రి సోంపేట పట్టణంలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎస్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ వై కృష్ణమూర్తి, డాక్టర్ ప్రధాన శివాజీ తదితరులను కలిసి పలాస జిల్లా సాధన గూర్చి వివరించారు. లక్షలాదిమంది సామాన్యులకు ఇటీవల జిల్లాల కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం జరిగిందని వాపోయారు.

ఇచ్ఛాపురం నుంచి 140 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీకాకుళం కేంద్రానికి వెళ్లి రావాలంటే ఒక రోజంతా చాలని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. అటువంటి పరిస్థితి నుంచి శివారు ప్రాంతానికి జిల్లా కేంద్రాన్ని కేటాయించి సౌలభ్యం చేకూర్చాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉన్నప్పటికీ కొంతమంది రాజకీయ ప్రతినిధుల కుటిల రాజకీయాలతో పలాస జిల్లా ఏర్పాటుకు విఘాతం కలిగిందని వాపోయారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా ఎంతమంది అడ్డుపడిన పలాస జిల్లా సాధనయ్య ఎన్ని ఆటంకాలు ఎదురైనా ఎంతమంది అడ్డుపడిన పలాస జిల్లా సాధన లక్ష్యంగా కొనసాగుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దుమ్ము దీనబంధు, దున్న శ్రీనివాస్, నవీన్ పాణిగ్రాహి, రౌతు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# మానవ హక్కులపై వ్యాసరచన పోటీలు




**ఇచ్ఛాపురం, డిసెంబరు 9(వార్త):** ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం ( 10 న)సందర్భంగా ఇచ్ఛాపురం నియోజవర్గ నేషనల్ ఫెడరేషన్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో. మానవ హక్కులు గురించి వివరించండి. సెల్ ఫోన్ లు వినియోగం వలన విద్యార్థులపై ఎటువంటి ప్రభావం ఉంటుంది. అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. నేషనల్ ఫెడరేషన్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నియోజకవర్గ ప్రెసిడెంట్ డి. కృష్ణ మూర్తి రెడ్డి ఆధ్వర్యంలోఈ పోటీలు జరిగాయి. ఈ పోటీలు గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, గవర్నమెంట్, స్వర్ణ భారతి డిగ్రీ కళాశాల, ఆదిత్య డిగ్రీ కళాశాల లలో జరిగాయి. ఈ పోటీలలో విజేతలకు ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం రోజున ముఖ్య అతిథులు చేతుల మీదుగా బహుమతులు అందజేస్తారని ప్రెసిడెంట్ డి. కృష్ణమూర్తి రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాంబాబు, ఎడ్యుకేషనల్ సెక్రటరీ రాజేంద్ర ప్రసాద్, అసిస్టెంట్ ఎడ్యుకేషనల్ సెక్రటరీ కే.సి. పూరి, ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్, స్వర్ణ భారతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సందీప్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస రావు ఉపాధ్యాయులు సంతోష్ కుమార్, శివ కుమార్ పాల్గొన్నారు .సుమారు 200 విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు. వ్యాసరచన పోటీల విజేతలు గా డి.రేవతి రెడ్డి, బి.స్వప్న, శాడి ఇందు (ఆదిత్య డిగ్రీ కాలేజ్), దుర్గాసి అఖిల , అన్వేష త్రిపాఠి, స్వాతి బెహరా (స్వర్ణ భారతి డిగ్రీ కాలేజ్), పల్లి లావణ్య, ఆశి పుష్పవతి, ఊర్మిళ బెహరా. కె.రేణుక(గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్) నిలిచారు.

# స్పెల్‌బీ పోటీల్లో శ్రీ నారాయణ స్కూల్ ప్రతిభ

### - జిల్లా స్థాయిలో ఏకకాలంలో ఐదు బహుమతులు కైవసం

**నరసన్నపేట, డిసెంబరు 9 (వార్త):** జలుమూరు మండలం నగరికటకంలో ఉన్న శ్రీ నారాయణ స్కూల్ మరోసారి తన అకడమిక్ సత్తాను చాటుకుంది. కలింగపట్నంలో వేదం ఇంటర్నేషనల్ ఎఐ అకాడమీ (2025-26) ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్పెల్ బీ పోటీల్లో ఈ పాఠశాల విద్యార్థులు అసాధారణ ప్రతిభతో రాణించి ఏక కాలంలో ఐదు ముఖ్య బహుమతులను కైవసం చేసుకున్నారు. ఈ ఘన విజయంతో పాఠశాల కీర్తి ప్రతిష్టలు జిల్లావ్యాప్తంగా ఇనుమడించాయి. జూనియర్ విభాగంలో ఎస్. సోహిత్ ప్రథమ బహుమతి సాధించగా, జె. రిత్విక తృతీయ బహుమతితో మెరిశారు. సీనియర్ విభాగంలో పి. హేమంత్ ద్వితీయ బహుమతిని, ఐ.శ్రీప్రియ, జి.యుగంధర్ తృతీయ బహుమతులను అందుకొని పాఠశాలకు గర్వకారణమయ్యారు. వివిధ విభాగాల్లో విద్యార్థులు చూపిన ప్రతిభ ప్రేక్షకులను, నిర్వాహకులను విశేషంగా ఆకట్టుకుంది. పోటీల అనంతరం నిర్వహించిన బహుమతి ప్రదాన కార్యక్రమంలో అతిథులు, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయుల సమక్షంలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి జ్ఞాపికగా ఛాయాచిత్రాలు తీసుకున్నారు. ఈ విజయం గురించి స్పందించిన పాఠశాల కరస్పాండెంట్ బి.నారాయణ రావు, ప్రిన్సిపాల్ ఎం. నాగరాజు మాట్లాడుతూ ఈ ఘనత విద్యార్థుల కఠోర శ్రమతో పాటు వారిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయుల సమర్థవంతమైన మార్గదర్శకత్వానికి ప్రతిబింబమని తెలిపారు. విద్యార్థులకు ఇంటి వద్ద సానుకూల వాతావరణం కల్పించి నిరంతరం ప్రోత్సాహం అందిస్తున్న తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా తమ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఇలాంటి విజయాలు సాధించి పాఠశాలకు మరింత కీర్తిని తీసుకురావాలని యాజమాన్యం ఆకాంక్షించింది.




## 16న జరగనున్న 'అభ్యుదయం సైకిల్ యాత్ర'లో ప్రజలందరూ భాగస్వామ్యులవ్వాలి

### -జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి



**శ్రీకాకుళం, డిసెంబరు 9 (వార్త):** మాదకద్రవ్యాల నిర్మూలన ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర హోంశాఖ మంత్రి ..అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో నవంబర్ 12న ప్రారంభించిన "అభ్యుదయం సైకిల్ యాత్ర" అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లో విజయవంతంగా ప్రయాణించి, డిసెంబర్ 16వ తేదీ నాడు ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం పట్టణంలోకి ప్రవేశించనుంది. ఈ యాత్రలో పట్టణ ప్రజలందరూ, ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, ముఖ్యంగా యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. డిసెంబర్ 16న, ఉదయం 9 గంటలకు ఈ యాత్ర ఆర్చి జంక్షన్ వద్ద శ్రీకాకుళం పట్టణంలో ప్రవేశించి, అక్కడి నుంచి డే అండ్ నైట్ జంక్షన్, రామలక్ష్మణ జంక్షన్, సూర్య మహల్, అరసవిల్లి మిల్లు జంక్షన్, పీఎస్ఆర్ జంక్షన్, సెవెన్ రోడ్స్ జంక్షన్ మీదుగా ప్రయాణించి, అనంతరం ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో జరగనున్న(డ్రగ్స్ ఫ్రీ సొసైటీ- డ్రగ్స్ ఫ్రీ శ్రీకాకుళం) అనే అంశం పై భారీ అవగాహన ప్రజాసభ జరుగుతుంది. ఈ యాత్ర జిల్లాలో పలు ప్రాంతాల్లో కొనసాగి ఇచ్ఛాపురంలో ముగియనుంది.

## ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన సిఐ



**పలాస, డిసెంబరు 9(వార్త):** పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను మర్యాదపూర్వ కంగా మంగళవారం కాశీబుగ్గ సీఐ వైరామకృష్ణ భేటీ అయ్యారు. స్థానిక చట్టవ్యవస్థ పాటించడం, నేరాల నివారణ, పరిశోధనలు, ప్రజల ఫిర్యాదులు పరిష్కరణలో ముఖ్య పాత్ర పోషించాలని ఆమె సూచించారు. సమాజ సేవ, భద్రతా సమన్వయం చూసుకోవాలని సూచించారు. స్థానికంగా ఉన్న శాంతి భద్రతులపై చర్చించారు. చట్ట ముందు ఎవరైనా తలవంచవలసిందని, దీనిపై రాజి లేకుండా పనిచేయాలని ఆమె కోరారు.

## పాఠశాలకు ప్రింటర్ వితరణ

**సోంపేట, డిసెంబరు 9 (వార్త):** కంచిలి మండలం చోట్రాయిపురం గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు బొరగాం గ్రామానికి చెందిన భీమవరంలో పనిచేస్తున్న మడ్డు మాధవరావు 15 వేల రూపాయల విలువైన ప్రింటర్ను ప్రధానోపాధ్యాయుడు మడ్డు తిరుపతిరావుకు బహుకరించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమం లో మాధవరావును ప్రధానోపాధ్యాయులతో పాటు గ్రామస్తులు ఎంతగానో అభినందించారు. మాధవరావు తరపున బంధువు మడ్డు రామకృష్ణ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





## గ్రంథాలయం ఏర్పాటుకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి

**కొత్తూరు, డిసెంబరు 9 (వార్త):** మెట్టూరు బిట్-2 పంచాయతీకి చెందిన కొందరు టీడీపీ నాయకులు ఎమ్మెల్యే మామిడి గోవిందరావుని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పంచాయతీకి సంబంధించిన పలు ముఖ్య సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పెదకోట ఆదినారాయణ, ఇసై ప్రశాంత్‌కుమార్ ఎమ్మెల్యేతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పెదకోట ఆదినారాయణ గారు ప్రధానంగా రెండు ముఖ్యమైన అంశాలను ఎమ్మెల్యే ముందుంచారు. శివాలయానికి సంబంధించిన దీపధూప నైవేద్య ఖర్చుల కోసం ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పంచాయతీలోని యువతకు ఉపయోగపడే విధంగా ఒక గ్రంథాలయం ఏర్పాటు కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలతో పాటు, పంచాయతీకి సంబంధించిన అనేక ఇతర సమస్యలను కూడా నాయకులు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు గారికి వివరించారు. సమస్యలను సావధానంగా విన్న ఎమ్మెల్యే మామిడి సానుకూలంగా స్పందించి. త్వరలోనే అన్ని సమస్యలను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.



### రిమ్స్‌లో రోగులకు
## మెరుగైన వైద్య సేవలు అందాలి

*** విశాఖకు రెఫర్ చేయకుండా స్థానికంగానే చికిత్స అందించాలి * కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్**

**శ్రీకాకుళం, డిసెంబర్ 9 (వార్త):** ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో రోగులకు మరింత మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ 29వ సమావేశం మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ హాజరయ్యారు. హాస్పిటల్ ఛైర్మన్‌గా కలెక్టర్, వైస్ ఛైర్మన్‌గా ఎమ్మెల్యే శంకర్ వివిధ అంశాలపై క్షుణ్ణంగా సమీక్షించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. జిల్లా నుండి వైద్యం కోసం వచ్చిన ఏ ఒక్క వ్యక్తిని కూడా విశాఖపట్నంకు రెఫర్ చేయకూడదని స్పష్టం చేశారు. చికిత్స కోసం వచ్చిన ప్రతి రోగికి ఇక్కడే సరైన వైద్యం అందించి, మిగిలిన సదుపాయాలు కూడా శ్రీకాకుళం ప్రభుత్వ ఆసుపత్రిలోనే లభించేలా డాక్టర్లు కృషి చేయాలని కోరారు. అవసరమైన వైద్య నిపుణులను ఇతర ప్రాంతాల నుండి రప్పించి సేవలు అందించాలని ఆదేశించారు. ఆసుపత్రిలో నిర్మాణం పూర్తయిన భవనాలను వెంటనే అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేయాలని, బాత్రూమ్‌లను సక్రమంగా నిర్వహించి, ఏసీలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రేడియాలజీ డిపార్ట్‌మెంట్‌కు అవసరమైన ఉపకరణాలు (డీఆర్, మెమోగ్రఫీ) సమకూర్చుకోవాలని, నెఫ్రాలజీ యూనిట్ ఐసీయూలో 4 పర్మినెంట్ బెడ్లు ఉండే విధంగా ఏర్పాట్లు చేయాలని, అన్ని షిఫ్టులలో డాక్టర్లు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. డీ-ఎడిక్షన్ సెంటర్‌కు ఆరుగురు సిబ్బంది నియామకం కోసం రిక్రూట్‌మెంట్ చేపట్టి, వారికి సకాలంలో జీతాలు చెల్లించాలన్నారు. ఎన్‌ఎంసీ నిబంధనల ప్రకారం 12 బాడీ స్టోరేజ్ యూనిట్లు ఉండాలని, ప్రస్తుతం ఉన్న 8 యూనిట్లకు అదనంగా ఏర్పాటు చేయాలని తెలిపారు. డైట్ నిర్వహణకు పర్మినెంట్ బిల్డింగ్ అందుబాటులోకి తీసుకొని, పరిశుభ్రమైన ఆహారాన్ని (హైజిన్ ఫుడ్) రోగులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలి. ఆసుపత్రిలోకి కుక్కలు, ఎలుకలు, విష సర్పాలు రాకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలి. పేషెంట్స్, వారి అటెండెంట్స్‌కు క్యూఆర్ కోడ్ ద్వారా నిరంతరం పర్యవేక్షణ జరుగుతుందని తెలిపారు. వైద్యులు, సిబ్బంది, స్టాఫ్ నర్సులు బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజల మన్ననలు పొందే విధంగా కృషి చేయాలని సూచించారు. వివిధ కార్పొరేట్ సంస్థల నుండి సామాజిక బాధ్యత నిధులతో అనేక ఉపకరణాలు సమకూర్చుకునేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసుకొని ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన నిధులను తీసుకువచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

### రూ. 66 లక్షలతో నూతన ఉపకరణాల ప్రారంభం

సమావేశానికి ముందు కలెక్టర్, ఎమ్మెల్యే శంకర్ తో కలసి ఆసుపత్రిలో రూ. 66 లక్షల నిధులతో సమకూర్చిన పలు ఉపకరణాలను ప్రారంభించారు. అందులో రూ. 8 లక్షల నిధులతో 45 స్ట్రెచర్‌లు ఏర్పాటు, బ్లడ్ బ్యాంక్‌లో 900 యూనిట్ల కెపాసిటీ, మైనస్ 40 డిగ్రీలు ఉన్న ఫ్రీజర్, వాషింగ్ మిషన్, ఇంటర్‌నెట్ సేవలు వంటివి ఉన్నాయి. ఈ యంత్రాలను సక్రమంగా వినియోగించుకొని నిరంతరం పర్యవేక్షణతో ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాలలో జీజీహెచ్ జేడీ, సూపర్ ఇంటెండెంట్, రిమ్స్ ప్రిన్సిపాల్, డీఎంహెచ్‌వో, డీసీహెచ్‌ఎస్, మున్సిపల్ అధికారులు, ఆర్‌ఎంవో, హెచ్‌వోడీలు, వైద్యులు, ఏవో తదితరులు పాల్గొన్నారు.

### ఔషధ నియంత్రణ కార్యాలయం ప్రారంభం

ఆరోగ్యాంధ్రప్రదేశ్‌ను నిర్మిద్దామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. రాష్ట్రంలో ఔషధ నియంత్రణ పరిపాలన కార్యాలయాలను ఆయన వర్చువల్‌గా ఆయన మంగళవారం ప్రారంభించారు. సర్వజన ఆసుపత్రి ఆవరణలో 92.22 లక్షల రూపాయలతో నిర్మించిన ఔషధ నియంత్రణ పరిపాలన కార్యాలయం, సహాయ సంచాలకులు కార్యాలయాలను స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఎన్నో పనులు చేపట్టడమైనదన్నారు. డ్రగ్స్ కంట్రోల్ కీలకమైనదన్నారు. గతంలో అద్దె భవనాల్లో ఔషధ నియంత్రణ కార్యాలయంలో ఉండదన్నారు. ఔషధ నియంత్రణ జిల్లా అధికారి చంద్రరావు మాట్లాడుతూ నూతన భవనం పూర్తి స్థాయిలో వినియోగంలోకి రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 11 భవనాలు వినియోగంలోకి వచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఆర్ వంశధార ఛైర్మన్ అరవల రవీంద్ర బాబు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అప్పలనాయుడు, జిజిహెచ్ సూపరింటెండెంట్ ప్రసన్న కుమార్, ఎపిఎంఐసిడిఎస్ ఇఇ శిమ్మన్న, ఔషధ నియంత్రణ అధికారి ఎన్. యుగంధర్, తదితర సిబ్బంది పాల్గొన్నారు.




# నిరసన ర్యాలీని విజయవంతం చేయాలి

**-మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదు**
**- తుది దశకు కోటి సంతకాల సేకరణ**
**-వైకాపా జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్**



**ఎల్ఎన్ పేట, డిసెంబరు 9(వార్త):** ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటుపరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ ఉద్యమం పూర్తియిందని వైకాపా జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మంగళవారం చిన్నకొల్లివలస ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ముందుగా చిన్నకొల్లివలస ఆర్ఆర్ కాలనీ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన వైయస్సార్ విగ్రహానికి పూలమాలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ పై ఈ నెల 10న ఎల్ఎన్ పేట మండల నుంచి పాతపట్నం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వరకు నిర్వహించే భారీ ర్యాలీను కార్యకర్తలు, నాయకులు, ప్రజలు ఫాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యే పాలవలస విక్రాంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై వెనక్కి తగ్గేదిలేదని స్పష్టం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఎక్కడ అమలు చేశారని దుయ్యపడ్డారు.



పాతపట్నం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ సామాన్య, పేద, మధ్య తరగతి వర్గాలకు అందుబాటులో ఉ న్న ప్రభుత్వ వైద్య విద్యను వైకాపా అధినేత మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి సారధ్యంలో అమలులోకి తెస్తే కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమని కూటమి ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు ఈ ర్యాలీను నిర్వహిస్తున్నామన్నారు. ఈ యొక్క భారీ ర్యాలీలో నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలు, నాయకులు, తదితరులు పాల్గొని ర్యాలీను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యమంలో ఎంపీపి రెడ్డి జ్యోతిలక్ష్మి, జిల్లా అధికార ప్రతినిధి శిమ్మ సాంభశివరావు, మండల ధ్యక్షులు పి. విష్ణు, సర్పంచ్ లు రెడ్డి రామారావు, లోచర్ల మల్లేశ్వరరావు, ముద్దాడ లక్ష్మణరావు, రావాడ మన్మధరావు, ఈగల చిన్నారావు, రెడ్డి సీతారాం, బలగ గోవిందరావు, యర్రజనార్ధనరావు, పెదకోట రాము, కెల్ల గణపతిరావు, శివ్వాల షణ్ముఖరావు, పైల తవిటినాయుడు, గేదెల శ్రీనువాసరావు, బాణాల దాలిరాజు, కోటి, పెనుమజ్జిసర్వేశ్వరరావు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలి

- సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పైడి పద్మావతి
- బూర్జ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పీవో ఎస్.గీత ఆధ్వర్యంలో అవగాహన సదస్సు



**సరుబుజ్జిలి, డిసెంబరు 9 (వార్త):** బాల్యవివాహాలు జరగకుండా అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత అవసరం ప్రతి ఒక్కరిపైన ఉందని సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పైడి పద్మావతి పిలుపునిచ్చారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ బూర్జ పీవో ఎస్.గీత ఆధ్వర్యంలో చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ భారత్ కార్యక్ర మంలో భాగంగా మంగళవారం సరుబుజ్జిలి మండల పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు వెన్నెల వలస ఆశ్రమ పాఠశాల జవహర్ నవోదయ పాఠశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బాలికలకు బాల్యవివాహాల నిరోధానికి నిరోధానికిచేపట్టవలసిన చర్యలు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎస్.గీత మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమవంతుగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఐసిపిఎస్ ఏ.గీత మాట్లాడుతూ బాల్యవివాహాలపై అవగాహన పెంచుకోవలసిన అవసరం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు సమాజం మెచ్చే బాలికలుగా గౌరవప్రదమైన జీవితాన్ని గడిపే విధంగా తగు జాగ్రత్తలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎం.జానకి జి.అమ్మన్నమ్మ, కళాశాల ఎన్.ఎస్.ఎస్ పీఓ రమేష్ సాహు, చింతాడ విజయ్ కుమార్, విజయ, స్థానిక అంగనవాడి వర్కర్స్ ఈ.కళావతి, పి.లక్ష్మి, వై.విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.




### 12 నుండి 21 వరకు
## ఎన్ఎస్ఎస్ అడ్వెంచర్ క్యాంప్

**శ్రీకాకుళం,డిశంబర్ 9 (వార్త):** ధర్మశాలకు ఎన్ఎస్ఎస్ అడ్వెంచర్ క్యాంప్-2025 పది రోజుల పాటు విద్యార్థులు వెళుతున్నట్లు యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ డి. వనజ సోమవారం తెలిపారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ, ఎచ్చెర్ల, శ్రీకాకుళం జాతీయ సేవా పథకం (ఎన్.ఎస్.ఎస్) విభాగం ఆధ్వర్యంలో, ఎన్.ఎస్.ఎస్ రీజనల్ డైరెక్టర్ ఆదేశాలమేరకు అటల్ బిహారి వాజ్ పేయ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ యాల్లీడ్ స్పోర్ట్స్, ధర్మశాల, హిమాచల్ ప్రదేశ్ వారు నిర్వహించబోవు ఎన్.ఎస్.ఎస్ అడ్వెంచర్ క్యాంప్-2025 పది రోజులపాటు డిశంబరు 12 నుండి 21 వరకు జరగనుందని వివరించారు. యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ ఫైనల్ ఇయర్, పి.జి. మొదటి సంవత్సరం చదువుతున్న 10 మంది విద్యార్థులకు ఒక కంటింజెంట్ ప్రోగ్రాం అధికారిని నామినేట్ చేయడం జరిగిందన్నారు. ఎంపికైన వారిలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీకి చెందిన బూరవిల్లి హర్షవర్ధన్ (ఎం.బి.ఏ), పావడ సాంబశివ (ఎం.బి.ఏ), టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన డొంకాన యశ్వంత్ (బి.ఎస్సీ కంప్యూటర్ సైన్స్), కోట తరుణ్ రెడ్డి (బి.కాం), సవర రాఘవేంద్ర రావు (బి.ఏ), రొక్కం భార్గవి (బి.కాం), ఇసై మమత (బి.ఎస్సీ కంప్యూటర్ సైన్స్) కాశీబుగ్గ ఎస్.బి.ఎస్.వై.ఎం కళాశాలకు చెందిన పోతనపల్లి మానస (బి.ఎస్సీ), బెహర త్రిష (బి.ఎస్సీ) ఉన్నట్లు చెప్పారు. యూనివర్సిటీ ప్రతినిధిగా టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం అధికారి వి. ల్యాక్ పాల్ విద్యార్థులకు యూనివర్సిటీ కంటింజెంట్ ప్రోగ్రాం అధికారిగా వ్యవహరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఆర్. రజిని ప్రోత్సాహంతో స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ సామ్రాజ్యలక్ష్మి సారథ్యంలో జరుతోందన్నారు. ఈ అడ్వెంచర్ క్యాంపులో పాల్గొంటున్న ప్రోగ్రాం అధికారి, విద్యార్థులను వైస్ చాన్సలర్ ప్రొ. బి. రజిని, యూనివర్సిటీ సిబ్బంది, ఆయా కళాశాలల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం శుభాకాంక్షలు తెలియజేశారు.

## కొత్తూరులో వైఎస్ఆర్సీపీ కోటి సంతకాల సేకరణ



**కొత్తూరు, డిసెంబరు 9 (వార్త):** వైస్సార్సీపీ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న కోటి సంతకాల కార్యక్రమంలో భాగంగా కొత్తూరు మేజర్ పంచాయతీ కార్యాల యంలో వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అధ్యక్షతన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రెడ్డి శాంతి మాట్లాడుతూ, ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తీసుకొస్తున్న చారిత్రాత్మక నిర్ణయాలు వివరించారు. ప్రజల మద్దతుతో పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కోటి సంతకాల కార్యక్రమం, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ విధానాలకు ప్రజా న్యాయం దక్కించే ఉద్యమంగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులు పాల్గొని ఐకమత్యంగా సంతకాలు చేశారు.

## ఆముదాలవలస మున్సిపాలిటీలో మూడు మురుగునీటి శుద్ధి కేంద్రాలకు శంకుస్థాపన



**ఆమదాలవలస, డిసెంబరు 9 (వార్త):** ఆముదాలవలస మున్సిపాలిటీ పరిధిలో తిమ్మాపురం, కుద్దిరం, చింతాడ గ్రామాల్లో మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ, స్వచ్ఛ్ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో కోటి 66 లక్షల రూపాయల నిధులతో ఈ మూడు కేంద్రాలు నిర్మించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆముదాలవలస శాసనసభ్యులు, రాష్ట్ర పియుసి ఛైర్మన్ శ్రీ కూన రవికుమార్, శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ గారు మాట్లాడుతూ, మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం ద్వారా స్థానిక ప్రజలకు మెరుగైన పారిశుధ్య వసతులు లభిస్తాయని, గ్రామాల అభివృద్ధికి ఇది మరో ముందడుగని తెలిపారు. శాసనసభ్యులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రజా ఫిర్యాదులు నిర్ణీత గడువులో పరిష్కారం చూపాలి

*** ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి**
*** జిల్లా పోలీసు అధికారులతో జూమ్ మీటింగ్**

**శ్రీకాకుళం, డిసెంబర్ 9 (వార్త):** ప్రజా ఫిర్యాదుల స్వీకరణ మరియు పరిష్కార కార్యక్రమంలో భాగంగా స్వీకరించిన ఫిర్యాదులను నిర్ణీత గడువులో విచారణ జరిపి, చట్టప్రకారం పరిష్కరించి బాధితులకు న్యాయం చేకూర్చాలని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి జిల్లా పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజా ఫిర్యాదుల సమయానుసార పరిష్కారం, పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వక వ్యవహారం, వారి సమస్యలకు సానుకూల స్పందన, చట్టప్రకారం త్వరిత చర్యలు, అలాగే పెండింగ్‌లో ఉన్న ముఖ్యమైన కేసుల దర్యాప్తు వేగవంతం వంటి అంశాలపై మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయం నుండి సబ్ డివిజన్, సర్కిల్, స్టేషన్ స్థాయి అధికారులతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుని పట్ల గౌరవంగా, మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలను శ్రద్ధగా వినాలన్నారు. ప్రజా ఫిర్యాదులను ఆలస్యం చేయకుండా తక్షణమే నమోదు చేసి, వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటివరకు స్వీకరించిన పబ్లిక్ గ్రీవెన్సెస్‌ను ప్రాధాన్యంగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న ముఖ్యమైన కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ప్రతి కేసు దర్యాప్తు చట్టబద్ధంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉండాలని సూచించారు. మొబైల్ ఫోన్ దొంగతనం, పోగొట్టుకున్న సందర్భాల్లో సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టి, పోగొట్టుకున్న మొబైళ్లను త్వరగా ట్రేస్ చేసి వారికి అప్పగించాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ కె.వి. రమణ, డిసిఆర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సంబంధిత పోలీసు అధికారులు తమ తమ పోలీస్ స్టేషన్లు కార్యాలయాల నుండి పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546